# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption


హైదరాబాద్
25-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 8+8
సంపుటి:16
సంచిక: 152

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## మహిళలకు తమిళ సిఎం విజయ్ వరాలు

ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల ప్రకటన

ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం



2లో

## సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె

**వరుస సెలవులతో కస్టమర్లకు ఇబ్బందులే**

న్యూఢిల్లీ,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు




2లో



## ఆయుధాలు సమకూర్చుకుంటున్న పాకిస్థాన్

ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేలా ప్రణాళికలు

టర్కీ నుంచి ఆయుధాలు సేకరిస్తున్నట్లు అనుమానాలు

మక్కా ఒప్పందలోకి ఇరాన్‌కు ఆహ్వానం

## మందు బాబులకు మంచి కిక్!




**తెలంగాణలో 121 ఫారిన్ లిక్కర్ బ్రాండ్లు**

**ఎక్సైజ్ శాఖ కీలక నిర్ణయం**

**సెప్టెంబర్ ఒకటి వరకు అభ్యంతరాల స్వీకారం**

**రెండో వారం నుంచి అందుబాటులోకి..**

తెలంగాణలో మందుబాబులకు గుడ్ న్యూస్. త్వరలో 121 ఫారిన్ లిక్కర్ బ్రాండ్ల ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ నిర్ణయం తీసుకుంది. విస్కీ,వైన్, వాడ్కా, బ్రాందీ,జిన్, టకీలా విభాగాలతో పాటు వివిధ రకాల బీర్లకు సంబంధించి కొత్త బ్రాండ్లు రాష్ట్రంలో అందుబాటులోకి రానున్నాయి.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తయారీ కంపెనీలు కొత్త పేర్ల నమోదు కోసం ప్రభుత్వానికి దరఖాస్తులు సమర్పించాయి. వీటిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయడానికి


2లో

## మీనాక్షి నటరాజన్ ఏం చేస్తున్నట్టు?!

**ఆమె ఉదాశీనం తెలంగాణ కాంగ్రెస్ కు శాపం**

**ఆదిలోనే కట్టడి చేయలేకపోయిన వైనం**

**రాహుల్ సన్నిహితురాలి వైఫల్యం**




తెలంగాణలో కాంగ్రెస్ గాడి తప్పుతోంది. రోజురోజుకు ఆ పార్టీలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారుతోంది. సీనియర్లు అసంతృప్త బాట పడుతున్నారు. మంత్రులు సైతం పక్కదారి పడుతున్నారు. ఎమ్మెల్యేలు ఒకరి నియోజకవర్గంలో మరొకరు వేలు పెడుతున్నారు. ఒకరిపై ఒకరు బాహటంగానే విమర్శలు చేసుకుంటున్నారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె అయితే ఒక అడుగు ముందుకు వేసి ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ తో పాటు టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పై వ్యక్తిగత విమర్శలు చేశారు.

## పులివెందుల నీదా నాదా సై!

ప్రత్యేకంగా గురిపెట్టిన టిడిపి కూటమి

ఫుల్ ఫోకస్ పెట్టిన బీటెక్ రవి

ముందుగానే అభ్యర్థిని రెడీ చేసిన వైసిపి

తెరపైకి దుష్యంత్ రెడ్డి

2లో




**క్రైమ్ మిర్రర్, రాయలసీమ బ్యూరో :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఏ క్షణం అయినా ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఎన్నికలు ప్రత్యక్షంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దానికి సంబంధించిన బిల్లును అసెంబ్లీలో పెట్టి ఆమోదం కూడా తెలుపుకున్నారు. అయితే మున్సిపల్ ఎన్నికలు జరిగితే అందరి దృష్టి పడేది పులివెందుల మున్సిపాలిటీ పైనే. జగన్మోహన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో కచ్చితంగా

## కాంగ్రెస్‌లో కుదుపు!



**20 మంది ఎమ్మెల్యేలు వేరు శిబిరం**

తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ పై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తిరుగుబాటు చేస్తారా? ఓ 20 మంది ఎమ్మెల్యేలతో ఆయన ప్రత్యేక శిబిరంగా ఏర్పడ్డారా? మొయినాబాద్ ఫామ్ హౌస్ లో ప్రత్యేకంగా సమావేశం అయ్యారా? పొలిటికల్ వర్గాల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ లో కొండా ఫ్యామిలీ వివాదం రచ్చకు దారితీసింది.

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నేతృత్వంలో ఫామ్ హౌస్ లో ప్రత్యేక సమావేశం**

**సీఎం రేవంత్ పై తాడోపేడో..**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఇప్పుడు సందట్లో సడే మియా అన్నట్టు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అదును కోసం వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు ఆ 20 మంది ఎమ్మెల్యేలతో సహా బీజేపీలోకి వెళ్తారని కొందరు.. కాదు కాదు గులాబీ పార్టీలో చేరుతారని మరికొందరు ఇలా ప్రచారం మొదలుపెట్టారు. మరోసారి కెసిఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ సోషల్ మీడియా ప్రచారం చేస్తోంది. దీంతో తెలంగాణలో ఒక అస్పష్టమైన రాజకీయం నెలకొంది.

**సీఎం ప్రెస్ మీట్..**

లండన్ పర్యటన ముగించుకుని సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాదులో

3లో

## బిజెపి వింత పోరాటం!

ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు రెండు రోజుల దీక్ష

బయట కాకుండా పార్టీ కార్యాలయంలో..

విమర్శలు చుట్టుముడుతున్న వైనం

3లో



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** అసలు తెలంగాణ బిజెపిలో ఏం జరుగుతోంది? ఒకవైపు కాంగ్రెస్ లో పతాక స్థాయికి విభేదాలు చేరాయి. మరోవైపు గులాబీ పార్టీ పుంజుకోవడం లేదు. ఇటువంటి సమయంలో ప్రజా సమస్యలపై భారతీయ జనతా పార్టీ పోరాటం చేస్తే తప్పకుండా తెలంగాణ సమాజం గుర్తిస్తుంది. కానీ ఆ విషయంలో బిజెపి ఎందుకో వెనుకబడుతోంది.



## జనసేనలోకి కొండా సురేఖ కుమార్తె!

**పరకాల టికెట్ తో పాటు ఉమ్మడి వరంగల్ పార్టీ బాధ్యతలు**

**జూబ్లీహిల్స్ లో కీలక నేతతో మంతనాలు**

**వేటు వేస్తే సురేఖ సైతం..**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కొండా ఫ్యామిలీ జనసేనలో చేరుతుందా? కాంగ్రెస్ పార్టీ వేటు వేస్తే ప్రత్యామ్నాయంగా పవన్ పార్టీలో చేరుతారా? ముందుగా ఆమె కుమార్తె సుస్మిత పటేల్ జనసేన తీర్థం పుచ్చుకుంటారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. సీఎం రేవంత్ తో పాటు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పై

2లో



# జనసేనలోకి కొండా సురేఖ కుమార్తె!

(మొదటి పేజీ తరువాయి)

సుస్మిత పటేల్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికీ ఆ వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటారని ఆమె ప్రకటించారు. దీంతో ఆమెపై కాంగ్రెస్ పార్టీ వేటు వేయడం ఖాయం. అలా వేటు వేసిన మరుక్షణం ఆమె జనసేనలో చేరిపోతారని టాక్ నడుస్తోంది. జూబ్లీహిల్స్ లో జనసేన కీలక నేతతో ఆమె చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

**ఆ హామీలు అమలు కాకపోవడంతో..**

ప్రస్తుతం తెలంగాణ మంత్రి వర్గంలో ఉన్నారు సురేఖ. అయితే ఆమె భర్త మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంకోవైపు పరకాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ కూడా వారి కుటుంబ సభ్యులకే కేటాయిస్తామని చెప్పారు. కానీ అవేవీ అమల్లోకి రాలేదు. ఇంకోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా పై పట్టు సాధించాలన్న కొండ కుటుంబం ఆశ తీరలేదు. అందుకే ఆ ఫ్యామిలీలో ఆ స్థాయిలో అసంతృప్తి రేగింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలో రేవంత్ అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తీరా ఇప్పుడు పరకాల




నియోజకవర్గం లో రేవూరి ప్రకాష్ రెడ్డిని ప్రోత్సహిస్తున్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న సురేఖకు తగిన గౌరవం కల్పించడంలో రేవంత్ విఫలమయ్యారు. అందుకే రేవంత్ తీరుపై ఆ ఫ్యామిలీ ఆగ్రహంతో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది.

**జనసేన విస్తరణ..**

జనసేన తెలంగాణలో విస్తరించేందుకు గట్టి ప్రయత్నాలు మొదలుపెట్టింది. పవన్ కళ్యాణ్ హైదరాబాదులో కేంద్ర కార్యాలయాన్ని కూడా తెరిచారు. చాలామంది వివిధ పార్టీల నాయకులు జనసేనలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. ఆ జాబితాలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా ఉన్నారు. ఆయనపై బిజెపి వేటు వేసింది. అందుకే ఆయన జనసేనలో చేరుతారన్న ప్రచారం సాగుతోంది. తెలంగాణకు రాబోయేది జనసేన ముఖ్యమంత్రి అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే దీని వెనుక భారీ స్కెచ్ ఉన్నట్లు అర్థం అవుతుంది. ఇప్పుడు కొండా ఫ్యామిలీ జనసేనకు దగ్గరవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

**భారీ వ్యూహంతోనే...**

కాంగ్రెస్ హై కమాండ్ సురేఖ పై చర్యలు తీసుకుంటే.. ఆమెను మంత్రివర్గం నుంచి తొలగిస్తే.. మాత్రం నేరుగా ఆమె జనసేనలో చేరే అవకాశం ఉంది. అటువంటిదేమీ లేకపోతే మాత్రం ముందుగా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ జనసేనలో చేరుతారు. ఆమెకు పరకాల జనసేన ఇన్చార్జి పదవి ఇవ్వడంతో పాటు.. ఉమ్మడి వరంగల్ పార్టీ పగ్గాలు అందించాలన్న నిర్ణయంతో జనసేన ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే జనసేన తెరవెనుక భారీ వ్యూహంతోనే అడుగులు వేస్తున్నట్లు అర్థం అవుతోంది.

## మహిళలకు తమిళ సీఎం విజయ్ వరాలు

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల వ్యయం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రకటించడంతో పాటు మహిళల కోసం దీని పరిధిని విస్తరించారు. ఇకపై ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స్ సర్వీసుల బస్సుల్లోనూ మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణం పొందేందుకు ఆదాయ పరిమితి, ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి నిబంధనలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. కాగా, గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అలాగే, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. చెన్నై శివార్లలోని పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమ ప్రభుత్వం విరమించుకుంటున్నట్లు తెలిపారు. విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 'పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నాం. ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసనకారులకు నేను అండగా ఉంటా' అని విజయ్ పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె

చేయాలంటూ బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు. ఇక సోమవారం14న వినాయక చవితి కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నడవవు. అలా నాలుగురోజుల పాటు బ్యాంక్ సేవలు అందక ప్రజలు కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. 11వ తేదీతోపాటు సెప్టెంబర్ 28 నుంచి మూడురోజుల పాటు మరోసారి సమ్మె చేస్తామని యూనియన్ హెచ్చరించింది. సెప్టెంబర్ 30తో ఆర్థిక సంవత్సరం సగం పూర్తవుతుంది. అప్పుడు అన్ని సంస్థలు తమ ఖాతా పుస్తకాలను సరిచూసుకుంటాయి. వారానికి ఐదు రోజుల డిమాండ్‌తో పాటు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం, పింఛను విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బ్యాంక్ సిబ్బంది కోరుతున్నారు. ఇప్పటికే రెండో, నాలుగో శనివారం సెలవులు ఇస్తున్నారు. మరో రెండు సెలవులు ఇస్తే అలా నెలలో ఐదురోజుల పనిదినం అమలవుతుంది. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే.. అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. సమావేశంలో బ్యాంక్ యూనియన్ల సభ్యులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

## ఆయుధాలు సమకూర్చుకుంటున్న పాకిస్థాన్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ తరవాత పాకిస్తాన్ తీరు అనుమానాస్పదంగా ఉంది. అంతర్జాతీయంగా ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు కూడా అనుమానాలు కలిగిస్తున్నాయి. మొత్తంగా పాకిస్తాన్ ఏదో భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా. ..అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ టర్కీ నుంచి భారీగా ఆయుధాలు దిగుమతి చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్‌లో కీలక వైమానిక స్థావరమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌కు టర్కీ సైనిక విమానాల రాకపోకలు పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా సీ-130 హెర్క్యులెస్ విమానాలు రావల్పిండిలోని నూర్ ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు వచ్చినట్లు తెలుస్తోంది.ఆగస్టు 19 నుంచి 21 వరకు టర్కీకి చెందిన ఎ-130 విమానాలు పాకిస్తాన్‌కు వచ్చి వెళ్లాయి. దీనిని భారత నిఘా వర్గాలు అసాధారణ పరిణామంగా గుర్తించింది. ఈ విమానాల ద్వారా పాకిస్తాన్ డ్రోన్లు, డ్రోన్ సంబంధిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రి తరలించి ఉండొచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ఇదే కాకుండా చైనా నుంచి కూడా భారీగా ఆయుధాల దిగుమతి జరుగుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ పొందిందనే వాదన కూడా ఉంది. అయితే, ఈ ఆయుధాలు లేదా డ్రోన్ల సరఫరాపై పాకిస్తాన్ లేదా టర్కీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. అయితే, టర్కీ డ్రోన్లపై పాక్ ఎప్పటి నుంచో ఆసక్తి చూపిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ టర్కీ డ్రోన్లను భారత్‌పై వాడింది. వీటన్నింటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఇప్పటికే బైరక్టర్ టీబీ2 డ్రోన్లు పాక్ వద్ద ఉన్నాయి. గతంలో భారత్ తో సైనిక ఘర్షణ సమయంలో టర్కీ తన డ్రోన్ ఆపరేటర్లను కూడా పాకిస్తాన్‌లో మోహరించింది. ప్రస్తుతం పాక్ తన మానవరహిత వైమానిక సామర్థ్యాలను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లాయిటరింగ్ మ్యునిషన్ వంటి వ్యవస్థల్ని సమకూర్చుకుంటోంది. మరోఇవైపు పశ్చిమాసియాలో ఘర్షణల వేళ పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. ఇంకా పలు దేశాలు ఈ మక్కా ఒప్పందం లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందంలో చేరాలని ఇరాన్ కు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. తమకు అందిన ఆహ్వానం పై సమీక్ష జరుపుతున్నామని, ఇది టెహ్రాన్‌కు దక్కిన విజయమని ఇరాన్ కీలకనేత మెహ్దీ రహీమీ పేర్కొన్నట్లు పశ్చిమాసియాలోని మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఇరాన్ విదేశాంగశాఖ ఈ ఆహ్వానాన్ని ధ్రువీకరించాల్సి ఉంది. సౌదీ అరేబియాకు ఇరాన్ అనుబంధ గ్రూప్ హూతీలకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాంటప్పుడు ఇరాన్‌కు ఈ ఆహ్వానం వెళ్లి ఉంటుందా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అణ్వస్త్ర దేశమైన పాకిస్థాన్, నాటో సభ్య దేశమైన తుర్కియే, చమురు నిల్వలతో సుసంపన్నమైన సౌదీ అరేబియా మధ్య జరిగిన సంయుక్త రక్షణ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా చర్చల్లో నిలిచింది.

## మీనాక్షి నటరాజన్ ఏం చేస్తున్నట్టు?!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** అవినీతి ఆరోపణలు చేశారు. ఇంత జరుగుతున్నా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సరిగ్గా స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**కాంగ్రెస్ అగ్ర నేతకు సన్నిహితురాలు..**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితురాలు మీనాక్షి నటరాజన్. అవినీతి మచ్చలేని కఠినమైన నాయకురాలిగా ఆమెకు పేరు ఉంది. ఆమె తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పుడు పార్టీని గాడిలో పెడతారని.. గాడి తప్పిన వారిని ఉపేక్షించరని అంతా భావించారు. కానీ రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలను ఆమె పెద్దగా పట్టించుకోకపోవడం పై విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ నాయకుల సొంత అజెండాలు, అంతర్గత ముఠా తత్వాల ముందు ఆమె వ్యూహాలు తేలిపోయినట్లు కనిపిస్తోంది. కఠిన నిర్ణయాలు తీసుకోకుండా.. బుజ్జగింపు రాజకీయం అనుసరించడంతో నేతలు ఆమె ఆదేశాలను పట్టించుకోవడం లేదు.

**ప్రాథమిక దశలో గుర్తించని వైనం..**

కాంగ్రెస్ పార్టీలో పరిస్థితి చేయి దాటి పోయిన వరకు పట్టించుకునే నాయకుడు లేరు. సమస్యలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో, క్రమశిక్షణ తప్పిన నేతలపై వెంటనే వేటు వేయడంలో ఇన్చార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని అభిప్రాయం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో బలపడింది. అంతర్గత విభేదాలు రచ్చకెక్కిన ప్రతిసారి కమిటీల ఏర్పాటు లేదా చర్చల పేరుతో కాలాన్ని వెల్లతీయడం, గట్టి చర్యలు లేకపోవడంతో నేతలు మరింతగా రెచ్చిపోతున్నారు. మరోవైపు ఆమె సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్లో రాజ్యసభ పదవి కోల్పోవడానికి తెలంగాణ కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు కారణమని తెలియడం కూడా ఆమె ఉదాసీనతను బయటపెడుతోంది.

**సురేఖ పై చర్యలు తీసుకుని ఉంటే..**

ప్రస్తుతం కొండా సురేఖ ఉదంతాన్ని తీసుకుందాం. ఆమెపై గతంలోనే చర్యలు తీసుకుంటే పరిస్థితి ఇంత దాకా వచ్చి ఉండేది కాదు. సురేఖ వరుసగా వివాదాస్పద కామెంట్స్ చేస్తూ వచ్చారు. ఆమె ప్రధాన అనుచరుడు సుమంత్ పై కూడా అనేక ఆర్థిక సెటిల్మెంట్ ఆరోపణలు వచ్చాయి. పార్టీకి తీవ్ర నష్టం కలిగించాయి. అయితే పార్టీకి హై కమాండ్ గా వ్యవహరిస్తున్న మీనాక్షి నటరాజన్ చూసి చూడనట్టుగా వెళ్లారు. ఇప్పుడు ఏకంగా కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ నేరుగా సీఎం రేవంత్, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పై గురి పెట్టారు. మీనాక్షి నటరాజన్ ఉదాసీనత తెలంగాణ కాంగ్రెస్ పట్ల శాపంగా మారింది. ఇకనైనా ఆమె కఠిన దండనకు దిగుతారా? లేదా? అనేది చూడాలి.

## మందు బాబులకు మంచి కిక్!

(మొదటి పేజీ తరువాయి)

సెప్టెంబర్ ఒకటి వరకు గడువు విధిస్తూ ఎక్సైజ్ శాఖ ఈ జాబితాను అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉంచింది.

**అభ్యంతరాలకు గడువు..**

ఇప్పటికే చాలా రకాల విదేశీ మద్యం బ్రాండ్లు తెలంగాణ రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు ఏకంగా మరో 121 బ్రాండ్లు అందుబాటులోకి రానుండటం విశేషం. ఫారిన్ బీర్లతోపాటు లగ్జరీ లిక్కర్ మార్కెట్లో ప్రవేశించేందుకు సిద్ధపడుతుండడం మందుబాబులకు హుషారు ఎక్కించే విషయం.. కాకా కొత్తగా అందుబాటులోకి రానున్న బీర్ల జాబితాలో చీతా, టైగర్, రెడ్ హార్స్, ఆ బెస్ట్, ఫ్లెన్స్బర్గర్, భూటానిస్, కాకా ఓస్ వంటి అంతర్జాతీయ స్థాయి బ్రాండ్లు ఉన్నాయి. వీటితో పాటు ప్రీమియం క్యాటగిరి కి చెందిన విస్కీలు, రకరకాల వోడ్కా, వైన్ బ్రాండ్లు కూడా త్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేలా కసరత్తు జరుగుతుంది. నిబంధనల ప్రకారం ఈ బ్రాండ్లపై సెప్టెంబర్ 1 లోపు ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే.. ఎక్సైజ్ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. సెప్టెంబర్ రెండో వారం నుంచి ఈ బ్రాండ్లు అన్ని అందుబాటులోకి రానున్నాయి.

**గ్లోబల్ మార్కెట్ విస్తరణకు..**

హైదరాబాద్ గ్లోబల్ నగరంగా మారుతోంది. అందుకే గ్లోబల్ బ్రాండ్లను తెలంగాణ వినియోగదారులకు చేరువ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్తగా అనుమతులు కోరుతున్న జాబితాలో 12, 15, 18,21 ఏళ్లనాటి సింగిల్ మాల్ట్ విస్కీలు, మంకీ షోల్డర్, ఎంఢ్రిక్స్ జిన్, టైగర్ లాగర్ బీర్లతోపాటు కొరియన్, జర్మన్ బ్రాండ్లు సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అంతర్జాతీయ ఉత్పత్తులతో పాటు దేశీయంగా తయారయ్యే ఆర్థోస్ కలెక్టివ్ మాల్ట్ విస్కీ, స్మోక్ ల్యాబ్ వోడ్కా, శంకర్ డిస్టలర్స్ వర్షాస్ అమెరికన్ విస్కీ, రీకో, వల్లోన్ కంపెనీల ఫ్లేవర్డ్ వైన్ లు కూడా మార్కెట్లో అడుగు పెట్టేందుకు రంగం సిద్ధం అయ్యింది. మొత్తానికైతే తెలంగాణలో మందుబాబులకు ఇది శుభవార్త.

## పులివెందుల నీదా నాదా సై!

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెడుతుంది. అందుకే అందరి దృష్టి ఆ మున్సిపాలిటీ పై ఉంది.

**అప్పట్లో కుప్పం పై..**

గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో చంద్రబాబు కుప్పం మున్సిపాలిటీ పై వైసీపీ పూర్తిగా దృష్టి పెట్టింది. అప్పట్లో సీనియర్ నేతగా ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫుల్ ఫోకస్ పెట్టారు. ఆ ఎన్నికల్లో అక్కడ టిడిపి ఓడిపోయింది. ఆ మున్సిపాలిటీని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. అప్పటినుంచి వై నాట్ కుప్పం అన్న నినాదాన్ని మొదలుపెట్టారు జగన్మోహన్ రెడ్డి. 2024 ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గాన్ని సైతం కైవసం చేసుకుంటామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో వారి అభిప్రాయం తారుమారు అయ్యింది. చంద్రబాబు భారీ మెజారిటీతో గెలిచి రాష్ట్రంలోనూ తిరుగులేని విజయం సాధించారు.

**బీటెక్ రవి ఫ్యామిలీ నుంచి..**



అయితే ఇప్పుడు కచ్చితంగా తెలుగుదేశం కూటమి పులివెందులపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతుంది. ఏడాది కిందట జడ్పిటిసి ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధించింది. కనీసం ఇక్కడ వైసిపి పోటీ ఇవ్వలేకపోయింది. అటువంటి పరిస్థితి పులివెందుల మున్సిపాలిటీలో సైతం చూపించాలని టిడిపి కూటమి అప్పుడే ప్రయత్నాలు మొదలు పెట్టింది. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి ఇక్కడ ఫుల్ ఫోకస్ పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించకూడదు అన్న పట్టుదలతో ఉన్నారు. తన కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్మన్గా రంగంలోకి దించాలని చూస్తున్నారు.

**చుట్టేస్తున్న దుష్యంత్ రెడ్డి..**

మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుగానే జాగ్రత్తలు పడింది. గతంలో కుప్పం నియోజకవర్గంలో వైసిపి ఏ రేంజ్ లో ప్రయత్నాలు చేసిందో ఆ పార్టీకి తెలియంది కాదు. అందుకే గత అనుభవాల దృష్టి అక్కడ దుష్యంత్ రెడ్డి అనే యువనేతను రంగంలోకి దించింది. ఆయన జగన్మోహన్ రెడ్డికి దూరపు బంధువు. అందుకే అక్కడ ముందుగానే రంగంలోకి దించారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి తో కలిసి పులివెందులలో నిత్య పర్యటనలు చేస్తున్నారు దుష్యంత్ రెడ్డి. ఆయననే మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటిస్తారని వైయస్సార్ కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో...

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

### ప్రభుత్వానికి మానవహక్కుల కమిషన్ ఆదేశాలు

హైదరాబాద్: తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలపై కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద, వరండాల్లో, కమ్యూనిటీ భవనాల్లో తరగతులకు హాజరవుతున్నారంటూ ప్రచురితమైన వార్త ఆధారంగా కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి నివేదికలు అందాయి. ఆయా నివేదికలను పరిశీలించగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత వంటి మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. నల్గొండ జిల్లా, నిడమనూరు మండలం, ఊట్కూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించినట్లు నివేదికలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో కుదుపు!

(మొదటి పేజీ తరువాయి)

అడుగు పెట్టారు. విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. మరోవైపు రేవంత్ ఈరోజు సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించనున్నారు. కాంగ్రెస్ పార్టీలో కొండా సురేఖ కుమార్తె వివాదం, అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం వంటి వాటిపై మాట్లాడే అవకాశం ఉంది. అయితే రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశాన్ని కంటే ముందే తెలంగాణ రాజకీయాలలో సంచలన పరిణామాలు చోటు చేసుకుంటా అన్న వార్తలు వినిపించాయి.

**తీవ్ర అసంతృప్తితో రాజగోపాల్ రెడ్డి..**

గత కొంతకాలంగా మంత్రి పదవి కోసం ఎదురుచూస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిత్య అసంతృప్తి వారిగా మారిపోయారు. నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. అయితే అధికార కాంగ్రెస్



పార్టీలో తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన మోయినాబాదులోని ఒక వ్యవసాయ క్షేత్రంలో సుమారు 20 మంది ఎమ్మెల్యేలతో రహస్య భేటీ జరిపినట్లు సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి మీద.. కొంతమంది వ్యక్తులు సాగిస్తున్న ఆధిపత్యం మీద తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సమావేశానికి కొంతమంది సీనియర్ మంత్రులు సపోర్ట్ చేసినట్లుగా కూడా తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు చెందిన మరో మంత్రి.. రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు చెందిన కొంతమంది సీనియర్ ఎమ్మెల్యేలు.. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఒకవేళ ఓ 20 మంది ఎమ్మెల్యేలు బయటకు వస్తే ప్రభుత్వం మైనారిటీలో పడినట్టే. కానీ రాజగోపాల్ రెడ్డిని నమ్మి అంతమంది బయటకు వస్తారా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఈ క్షణానికి ఏం జరుగుతుందో అనేది ఇప్పుడు ఉత్కంఠ గా మారింది. చివరికి ఏం జరుగుతుందో చూడాలి.

## క్రమశిక్షణ కమిటీకి కొండాసురేఖ వ్యవహారం

**ఇందులో ఎవ్వరు కూడా ఇక మాట్లాడొద్దు**

**సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు**

**రాజకీయ వ్యవహారాలపై ప్రజాపతినిధులతో రేవంత్ చర్చ**

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నియమాలకు నేతలంతా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పందించారు. పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ అంశంపై ఎవరూ మాట్లాడొద్దని.. ఇకపై ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని చెప్పారు. సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణను నిర్లక్ష్యం చేయొద్దని నేతలకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావన్నారు. భూసేకరణ, ఫారెస్టు క్లియరెన్సులకి సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టండని ప్రతినిధులకు సూచించారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్లపల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగ మాయి, మందల సామేల్, యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు పాల్గొన్నారు.

# బిజెపి వింత పోరాటం!

(మొదటి పేజీ తరువాయి)

నేతలు సైతం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ప్రజా సమస్యలపై బయటకు వచ్చి ఆందోళనలు చేయాల్సింది పోయి.. సొంత పార్టీ కార్యాలయంలో ఆందోళన చేస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.

**ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని..**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిన ఫీజు రియంబర్స్మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వినూత్న నిరసన తెలిపారు. నాంపల్లి లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రెండు రోజుల నిరాహార దీక్ష చేపట్టారు. ఫీజుల బకాయిలు– బిజెపి లడాయి పేరుతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి.. లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే తమ ధ్యేయమని బిజెపి శ్రేణులు చెబుతున్నాయి. అయితే విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సొంత పార్టీ కార్యాలయంలో కూర్చొని దీక్షలు చేయడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో దీని పైనే పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

**ప్రజాక్షేత్రంలోకి రాకుండా..**

విద్యార్థుల పక్షాన పోరాటం చేసేటప్పుడు ప్రజాక్షేత్రంలోకి వచ్చి నిరసన తెలపడమే నిజమైన ప్రజాస్వామ్య విధానం. పార్టీ కార్యాలయంలో ఏసీ గదుల్లో కూర్చొని దీక్షలు చేయడం వల్ల కేవలం క్యాడర్కు తెలుస్తుంది తప్ప విద్యార్థి లోకానికి ఎంత మాత్రం తెలియదు. ఈ విషయంపై ప్రభుత్వం కూడా స్పందించే అవకాశం లేదు. విద్యార్థుల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేయడం, కలెక్టరేట్లు, సచివాలయం ముట్టడి వంటి ప్రత్యక్ష పోరాటం చేస్తేనే ప్రభుత్వ యంత్రాంగంలో చలనం వస్తుందన్న విషయం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు గ్రహించాలి. కార్యాలయంలో దీక్ష చేయడం వల్ల పోలీసుల అరెస్టులు ఉండకపోవచ్చు. ఇబ్బందులు ఎదురుకాకపోవచ్చు. కానీ ప్రజాదరణ పొందడం, ప్రభుత్వాన్ని కార్నర్ చేయడం అంత సులభం కాదు. లక్షలాదిమంది పేద విద్యార్థులకు సంబంధించిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయి అంశాన్ని హైలెట్ చేస్తున్న.. అది రోడ్డుపైకి వచ్చి పోరాటం చేయడమే ఉత్తమమన్న విషయాన్ని బిజెపి గ్రహించుకుంటే మంచిది.

## ఏఈ కుటుంబంపై మాతమార్పిడి కోసం ఒత్తిడి

**సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు**

**రెండు వేర్వేరు సూసైడ్ లేఖలు స్వాధీనం**

**జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వెల్లడి**

కాకినాడ: ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ రెండింటిలోనూ రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్‌ఖాన్ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొనడంతో అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరిలో దూకారు. రియాన్స్ ప్రాణాలతో బయటపడగా మిగిలిన ముగ్గురు మృతిచెందారు. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. నూకరాజు వద్ద, సౌజన్య స్కూటీలో రెండు సూసైడ్ నోట్‌లు దొరికాయి. మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడని ఎస్పీ వెల్లడించాడు. ఆమె మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పీఎస్‌లో కేసు నమోదు చేయగా, నిందితుడు సాధిక్‌ఖాన్ కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లోగాలింపు చేపట్టామని అన్నారు. చివరికి యూపీలోని మేరఠ్‌లో అతడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేశాం. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై కాకినాడ తీసుకొచ్చామన్నారు. నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారై మేరఠ్ చేరుకున్న సాధిక్.. స్నేహితులకు



మాయమాటలు చెప్పి ఆశ్రయం పొందాడు. ఫోన్, డబ్బు పోయినట్లు వారికి చెప్పాడు. అతడిపై వస్తోన్న మరికొన్ని ఆరోపణలపై విచారణ జరుగుతోంది. నిర్ధారణ అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తాం. హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద సాధిక్‌పై కేసులు నమోదు చేశామన్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తాం. కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతాం. కస్టడీలో ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. సామూహిక ఆత్మహత్య ఘటనకు ముందు బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు అండగా ఉంటారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఎస్పీ కోరారు. సాధిక్‌ఖాన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం కాకినాడ సబ్‌జైలుకు సాధిక్‌ఖాన్‌ను తరలించారు. నిందితుడిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ సర్పవరం పోలీసులు కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

## అపార్ట్‌మెంట్ ఐదో అంతస్థు నుంచి దూకిన యువతి

**అక్కడిక్కడే మృతి...దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

హైదరాబాద్: హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో విషాదం చోటుచేసుకుంది. డిప్రెషన్‌తో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కానూర్‌కు చెందిన సోను పురుషోత్తమన్, శీతల్ భార్యాభర్తలు. ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల చిన్నారి ఉంది. పురుషోత్తమన్ ఎస్‌బీఐలో డీఎంగా పనిచేస్తున్నారు. భార్య, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో శీతల్ (32) టెర్రస్ ఎక్కే మెట్లపై 10 నిమిషాలు పాటు కూర్చుంది. తర్వాత టెర్రస్ పైకి ఎక్కి అపార్ట్‌మెంట్ గేటు ఆవరణలోకి దూకేసింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ బలవన్మరణానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆమె భర్తతో పాటు కేరళలో ఉన్న సోదరుడితోనూ మాట్లాడారు. శీతల్ కొంత కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతోందని.. దీనికి మందులు వినియోగిస్తున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. కేరళలో ఉన్న శీతల్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

## అధ్వాన్నంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి

**ప్రాథమికి సౌకర్యా కూడా మృగ్యం**

**ఇలా అయితే యువత ఎలా చదువు సాగిస్తుంది**

**మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజిత్ దీప్కే లేఖ**

న్యూఢిల్లీ, : ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రజా విద్యను ప్రాధాన్యతగా తీసుకొని పాఠశాలలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే లేఖ రాశారు. ఈ సమస్యను పరిష్కరించే ముందు ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై సమాచారం అందుబాటులో ఉంచాలని కేంద్రాన్ని ఆయన కోరారు. అందుకు సంబంధించిన వివరాలను విద్యశాఖ బహిరంగ పర్చాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరించబడ్డాయని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నింటికి మరమ్మతులు లేదా పూర్తి పునర్నిర్మాణం అవసరం ఉందో వివరించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశారు. వాటిలో ఎన్ని భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయో వెల్లడించాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు కేటాయించారు? అందులో ఎంత ఖర్చు చేశారు? కూడా తెలపాలని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంకా ఎన్ని అదనపు ప్రభుత్వ పాఠశాలలు అవసరం? అవుతాయో కూడా చెప్పాలని కేంద్ర విద్యా శాఖ మంత్రిని కోరారు. బోధనతో పాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఇంకా ఇతర ఏఏ విధులు, బాధ్యతలు అప్పగించారో కూడా చెప్పాలని కేంద్రాన్ని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు, శుభ్రంగా పని చేసే టాయిలెట్లు, సరైన క్రీడా సౌకర్యాలతోపాటు పరికరాలు ఉన్నాయో కూడా వివరించాలని కేంద్ర మంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. అయితే ఈ లేఖ తాను రాజకీయం కోసం కాదని.. ఇది విద్యార్థుల భవిష్యత్తు గురించి రాసిన లేఖ అంటూ కేంద్ర విద్యా మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

## సింగరేణిని కాపాడుకుంటూ.. లాభాల బాటలో నడిపిస్తాం

**సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు కై క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు!**

**బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం మైనింగ్‌లోకి సింగరేణి**

**ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయం**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ లాంటి అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు కూడా లాభదాయక సంస్థగా అందించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం దిశా నిర్దేశర చేస్తూ కంపెనీ మనుగడకు కీలకమైన బొగ్గు బ్లాక్‌లు సాధించడంలో సంపూర్ణ సహకారం అందిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లుకు సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిథ్య, అధికార సంఘాల నాయకులు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను తీసుకోకపోవడం, ఉన్న గనులను మూసివేయడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఐదారు సంవత్సరాల్లో సంస్థ మూతపడే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులు గట్టి పట్టుదలతో నైని కోల్ బ్లాక్‌ను సాధించామని చెప్పారు. 2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీ–అసైన్ చేసిన తాడిచర్ల–2 కోల్ బ్లాక్ విషయాన్ని కేంద్రంతో మాట్లాడి మైనింగ్ లీజు దక్కించుకోవడంలో ప్రభుత్వం సఫలమైందని తెలిపారు. అంతేకాకుండా జెన్కోను ఒప్పించి, సింగరేణికి వేలంలో మణుగూరు డిప్ సైడ్ బ్లాక్ –2 దక్కేలా కృషి చేశామన్నారు. ఒడిశాలోని 'నైనీ' బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి వస్తుండటంతో భవిష్యత్తులో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా ఒకప్పటి లా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.





**పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తీరును గమనిస్తే..ప్రతిపక్షాలు సభను స్తంభించడం మినహా చేసిందేమీ లేదు. లోపలా, బయటా ప్రియాంక తీరు ఆశాజనకంగా ఉంది. ఆమె సపందర్భోచితంగా మాట్లాడుతున్నారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ గలుగు తున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగలరని భావించవచ్చు. పార్మలెంటులో సమస్యలపై ఆమె అవగాహనతో మాట్లాడుతున్నారు. ఎందుకంటే రాహుల్ కేవలం మోడీ లక్ష్యంగా చేస్తున్న విమర్శలు పెద్దగా ఆకట్టుకోలేక పోతున్నాయి.**

మోడీని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల

# ప్రియాంక బెటర్ ఛాయిస్

తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. లోక్‌సభలో అంశాలపై జరిగిన చర్చలో..విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. గత సమావేశాల్లో వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించడ లేదు. డీ లిమిటేషన్‌పై మళ్లీ పార్లమెంట్ పెడితే ప్రియాంకను ముందు పటెట్టం మంచిది. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం చేయగలదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధం ఆకట్టుకుంది. కేవలం ఆర్ఎస్ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరగాలి. సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడం లో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో..పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది విపక్ష పార్టీల

బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఆమెను ముందు నిలబెడితే మంచిది.

**ఈ దేశంలో మతం ఒకప్పుడు విశ్వాసానికి ప్రతీకగా ఉండేది, కానీ నేడు అది అధికార పీఠాలను దక్కించుకోవడానికి వాడే అత్యంత ప్రమాదకరమైన రాజకీయ ఆయుధంగా మారిపోయింది. ఓట్ల పంట పండించుకోవడానికి, మనుషుల మధ్య ద్వేషపు గోడలు కట్టడానికి మతాన్ని ఒక సాధనంగా మార్చుకున్న శక్తులు సమాజంలో నిరంతరం పనిచేస్తూనే ఉన్నాయి. ఇది నిన్న మొన్న మొదలైన తంతు కాదు, కానీ ఈ రోజు మన కళ్లముందు కనిపిస్తున్న ఆ ద్వేషపు వేగం, దాని వెనుక ఉన్న క్రౌర్యం గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరాయి.**

అది మెల్లగా, నిశ్శబ్దంగా సామాన్య మనిషి మనసులో విషబీజాలను నాటుతూ, పక్కనున్న మనిషిని శత్రువుగా చూసేలా నరనరాల్లోకి విద్వేషాన్ని ఎక్కిస్తోంది. ఆ విత్తనం మొలకెత్తి వృక్షమయ్యే నాటికి సమాజపు నేల పూర్తిగా విషమయమైపోతోంది.

వాస్తవానికి సామాజిక మాధ్యమాలు భావప్రకటనకు వేదిక కావాలో, అక్కడ ఈ విద్వేషపు అగ్నికి మరింత ఆజ్యం పోసే పని జరుగుతోంది. వాట్సాప్ గ్రూపుల్లో తిరిగే నకిలీ వీడియోలు, ఎక్స్ లో ట్రెండ్ అయ్యే అర్ధసత్యాలు, యూట్యూబ్‌లో వైరల్ అయ్యే ద్వేషభాషణలు సామాన్యుల మనసుల్లో ఒక నిరంతర విద్యుత్ ప్రవాహంలా ప్రవహిస్తున్నాయి. పదేపదే ఒకే అబద్ధాన్ని వందల సార్లు ప్రచారం చేసినప్పుడు అది నిజంగానే అనిపిస్తుంది, ఇది కేవలం మనోవైజ్ఞానిక సూత్రం మాత్రమే కాదు, కుటిల రాజనీతి . ఒక్కసారి గతంలోకి వెళ్లి ఆలోచిస్తే, మన ఊరికి వరదలు వచ్చినప్పుడు పక్కింటి ముస్లిం కుటుంబం మనతో పాటే

ప్రకారం నడుస్తున్న రాజకీయ యంత్రంలో భాగాలు.

గణాంకాలను పరిశీలిస్తే, దేశంలో నమోదవుతున్న మొత్తం ద్వేషపూరిత ప్రసంగాల కేసులలో దాదాపు 67 శాతం కేవలం ఎన్నికల సమయంలోనే నమోదవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వ్యాపించే అబద్ధాల వల్లే నేడు జరుగుతున్న మత ఘర్షణలలో 82 శాతానికి పైగా కారణమవుతున్నాయని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ అంకెలు కేవలం సంఖ్యలు కావు, కుంటుపడుతున్న మన సామాజిక ఐక్యతకు తీవ్ర హెచ్చరికలు. ఒకప్పుడు ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభంగా నిలిచిన పత్రికారంగం, మీడియా ఈ రోజు ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోందో ఆలోచించాల్సి ఉంది. టిఆర్‌పిల కోసం, యాజమాన్యాల రాజకీయ లాభాల కోసం కొన్ని మీడియా సంస్థలు మత ఉద్వేగాలను పెంచి పోషిస్తున్నాయి. చర్చల పేరిట రాత్రి వేళల్లో జరిగే అరుపుల పోటీల్లో సమాజానికి కావలసిన వెలుగు లేదు, కేవలం కాల్చే అగ్ని మాత్రమే ఉంది.

# మతం ఆయుధమైన వేళ... పౌరుడికి మౌనమే అతిపెద్ద శాపం!



మత విద్వేష ప్రచారం అంటే కేవలం ఒక నాయకుడు మైకు ముందు చేసే ప్రసంగమో, టీవీ స్క్రీన్‌పై కనిపించే వార్తో కాదు. అదొక పద్ధతి ప్రకారం నడిచే పెద్ద వ్యవస్థ.

కష్టాలు అనుభవించింది. బిడ్డకు తీవ్రమైన జ్వరం వస్తే అర్ధరాత్రి వేళ తోడుగా నిలబడింది పక్కనున్న హిందూ పొరుగువాడే. ఉద్యోగం పోయి ఆధారం కోల్పోయిన వేళ భుజం తట్టి ధైర్యం చెప్పింది క్రైస్తవ సహఉద్యోగి . ఇవి ప్రతిరోజూ మన సమాజంలో జరుగుతున్న నిత్యసత్యాలు. కానీ ఇవి ఎక్కడా ప్రైమ్‌టైమ్ వార్తలు కావు, ఎందుకంటే సమాజంలో ఐక్యత అమ్మకానికి రాదు, కేవలం ద్వేషం మాత్రమే లాభాలను తెచ్చిపెడుతుంది.

ఈ మత విద్వేష ప్రచారానికి ఒక స్పష్టమైన రాజకీయ, ఆర్థిక ప్రయోజనం ఉంది. ప్రజలు భయంలో ఉన్నప్పుడు తమను కాపాడే ఒక రక్షకుడి కోసం వెతుకుతారు. ఆ రక్షకుడి పాత్రను సృష్టించడానికి కంటే ముందే, ఒక కృత్రిమ శత్రువును సమాజం ముందుకు తీసుకురావడం అవసరం. ఆ శత్రువు ఒక మతం కావచ్చు, ఒక కులం కావచ్చు. భారతదేశంలో ఎన్నికల సీజన్ వచ్చిందంటే చాలు మత ఉద్రిక్తతలు అకస్మాత్తుగా పెరుగుతాయి. ఏదో ఒక జిల్లాలో పాత వివాదాలు తెరపైకి రావడం, నాయకుల రెచ్చగొట్టే ప్రసంగాల తర్వాత హింస చెలరేగడం ఒక పద్ధతి

ఒక మైనారిటీ ప్రాంతంలో జరిగే చిన్న సంఘటనపై గంటల తరబడి రచ్చ చేసే మీడియా, అదే మైనారిటీ కుటుంబంపై జరిగే ఘోరమైన హింసను కనీసం స్క్రోలింగ్‌లో కూడా చూపించకపోవడం తీవ్రమైన పక్షపాతం. మన దేశంలో హేట్ స్పీచ్ నిరోధానికి ఐపీసీ 153ఏ , 295ఏ వంటి బలమైన చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో పారదర్శకత కొరవడింది. కోర్టులు హెచ్చరించినా ద్వేషపూరిత మాటలు మాట్లాడే వ్యక్తులు మరుసటి రోజే మళ్లీ మైకుల ముందుకు వస్తున్నారు. ఈ పరిణామాల మధ్య నాకెందుకులే అని సామాన్యుడు మౌనంగా ఉండటమే అతిపెద్ద ముప్పు. నీవు మౌనంగా ఉన్నా రాజకీయాలు నిన్ను వదిలిపెట్టవు. ఏదో ఒక రోజు నీ ఉనికినే ప్రశ్నించే పరిస్థితి వస్తుంది.

అందుకే విద్యావ్యవస్థ నుంచే పిల్లలకు మానవ విలువలు, మత సామరస్యాన్ని నేర్పించాలి. ద్వేషాన్ని వ్యాప్తి చేసే సంస్థలు, మీడియాపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. అన్నింటికీ మించి మనిషిని మనిషిగా ప్రేమించే సంస్కృతి పునరుద్ధరించబడాలి. భారతదేశం అనేది ఒకే మతానికి చెందినది కాదు, ఇది అనేక సంస్కృతులు, మతాల కలయికతో ఏర్పడిన పవిత్రమైన సమాజం. ఆ భావనను దెబ్బతీసే ప్రతి ప్రయత్నాన్ని పౌరులుగా నిలదీయడమే నేటి తక్షణ అవసరం



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# శాసనసభ కమిటీలకుఎంతో ప్రాధాన్యం

**ఆయా వర్గాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి**

**బడ్జెట్ కేటాయింపులు సమీక్షించుకోవాలి**

**శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం ప్రసాద్**

హైదరాబాద్:ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని,ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానీటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా- జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు



మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసనమండలి మైనారిటీల సంక్షేమ కమిటీ,షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సమావేశమయ్యింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ లు హాజరయ్యారు. మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్ కూడా హాజరయ్యారు. శాసనమండలి ÷ూఅ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం , సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యలు, శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో చైర్మన్, స్పీకర్, మరియు సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

## నిర్మల్‌లో ఇద్దరు, యాదాద్రిలో ఎసిబికి చిక్కిన నలుగురు

### లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఎసిబి అధికారులు

నిర్మాల్/యాదాద్రిభువనగిరి: వేర్వురు చోట్లు నలుగురు అధికారులు ఎసిబికి చిక్కారు.

వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు పన్నుల శాఖాధికారులు ఏసీబీ కి పట్టుబడ్డారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం పన్నుల శాఖ నిర్మల్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు నుంచి రూ. 50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎస్‌టీవో కొప్పెల గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయికృష్ణను ఆదిలాబాద్ రేంజ్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధిన ఆడిట్ లెక్కల వ్యవహారంలో అనుకూలంగా నివేదికను తయారు చేయాలని మంచిర్యాల పట్టణానికి చెందిన జువెల్లరి దుకాణపు యజమాని లక్కింశెట్టి వీర భాస్కర రావు ఎస్టీవో అధికారులను సంప్రదించాడు. దీంతో ఇద్దరు అధికారులు మొదల లక్ష రూపాయలు డిమాండ్ చేసి చివరకు రూ. 50వేలకు ఒప్పందం చేసుకున్నారు.

అనంతరం ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ముందస్తు వ్యూహం ప్రకారం సోమవారం ఇద్దరు అధికారులను పట్టుకున్నారు. అవినీతికి పాల్పడ్డ ఇద్దరిని కోర్టులో హాజరుపరిచామని వెల్లడించారు. ఇకపోతే అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. సోమవారం ఉదయం నిర్మల్ జిల్లాలో ఇద్దరు ఏసీబీకి పట్టుబడగా యాదాద్రి జిల్లాలో మరో ఇద్దరు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. జిల్లాలోని ఆలేరు మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వేముగంటి పూర్ణచందర్ రావు, గ్రామ పాలనాధికారి షేక్ అహ్మద్ ఫిర్యాదుదారుడు నుంచి రూ.14 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు.

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 25-8-2026


# కూకట్ పల్లి లో 355 అక్రమ నిర్మాణాలు.. బిల్డర్ల తప్పులకు కొనుగోలుదారులే బలి!

**అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు.. జీవితకాల సంపాదనతో ఫ్లాట్లు కొన్న వారికి ఇప్పుడు ఆందోళన**

**బిల్డర్ తప్పు.. కొనుగోలుదారుడికి శిక్ష ఎందుకు?**

**ఫ్లాట్ కొనుగోలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలి**

**బిల్డర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి**



**కూకట్‌పల్లి, ఆగస్టు 24 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి జోన్ పరిధిలో 355 అక్రమ నిర్మాణాలను అధికారులు గుర్తించినట్లు వెలువడిన సమాచారం కలకలం రేపుతోంది. అనుమతులు, నిబంధనలను పక్కనపెట్టి కొంతమంది భవన యజమానులు, బిల్డర్లు చేపట్టిన అనధికారిక నిర్మాణాల ప్రభావం ఇప్పుడు ఆ ఫ్లాట్లను కొనుగోలు చేసిన సాధారణ ప్రజలపై పడే పరిస్థితి ఏర్పడింది.

**బిల్డర్ల అత్యాశ.. కొనుగోలుదారులకు శాపం!**

భవన నిర్మాణానికి అనుమతులు తీసుకున్న తర్వాత నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు, అదనపు నిర్మాణాలు చేపట్టడం వల్లే అనేక సమస్యలు తలెత్తుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన వివిధ రుసుములు, పన్నులను తప్పించుకునేందుకే కొందరు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే బిల్డర్లు చేసిన తప్పులకు వారి వద్ద నుంచి ఇల్లు కొనుగోలు చేసిన సామాన్య ప్రజలు ఎందుకు ఇబ్బందులు పడాలి? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది.

**అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా?**

గత ప్రభుత్వ హయాంలో కొంతమంది బిల్డర్లు పరిమిత అంతస్తులకు అనుమతులు తీసుకుని, నిర్మాణం పూర్తయిన తర్వాత ఆక్యుపెన్సీ ధ్రువీకరణ పత్రం పొందినప్పటికీ, అనంతరం అదనపు అంతస్తులు లేదా ఇతర అనధికారిక నిర్మాణాలు చేపట్టిన సందర్భాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పుడే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో కఠినంగా పర్యవేక్షించి చర్యలు తీసుకుని ఉంటే, ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి తలెత్తేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. గేటెడ్ కమ్యూనిటీలపైనా అనుమానాలు అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీలు సైతం అనధికారిక నిర్మాణాల జాబితాలోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. అనుమతించిన నిర్మాణాలకు మించి మార్పులు, చేర్పులు జరిగితే వాటిపై అప్పట్లోనే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది బిల్డర్లు నిబంధనలను ఉల్లంఘిస్తూ, అధికార వ్యవస్థను తప్పుదోవ పట్టించి లేదా వివిధ మార్గాల్లో ఒత్తిళ్లు తీసుకొచ్చి అదనపు నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది.

**బిల్డర్ తప్పు.. కొనుగోలుదారుడికి శిక్ష ఎందుకు?**

తమ జీవితకాల సంపాదనను వెచ్చించి ఫ్లాట్ కొనుగోలు చేసిన కుటుంబాలు ఇప్పుడు నిర్మాణాల చట్టబద్ధతపై ఆందోళన చెందుతున్నాయి. బిల్డర్‌పై చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితుల్లో, ఆయనను నమ్మి ఫ్లాట్ కొనుగోలు చేసిన అమాయక ప్రజలు నష్టపోయే పరిస్థితి రావడం బాధాకరం. అందువల్ల 355 అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే సమయంలో బిల్డర్ బాధ్యత, అధికారుల పర్యవేక్షణ లోపం, కొనుగోలుదారుల హక్కులు అనే మూడు అంశాలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పనిసరే.. కానీ కొనుగోలుదారులకు రక్షణ కావాలి**

నిబంధనలను ఉల్లంఘించిన అక్రమ నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందే. అయితే, బిల్డర్ చేసిన తప్పుకు తెలియక ఫ్లాట్ కొనుగోలు చేసిన సాధారణ ప్రజలు శిక్షకు గురికాకుండా ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. బిల్డర్ తప్పు చేస్తే బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలి.. జీవితకాల సంపాదనతో ఇల్లు కొనుగోలు చేసిన సామాన్యుడిని బాధ్యుడిని చేయడం న్యాయసమ్మతం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఫ్లాట్ కొనుగోలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలి**

భవిష్యత్తులో ఫ్లాట్ లేదా ఇల్లు కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. భవన నిర్మాణ అనుమతి, అనుమతించిన అంతస్తులు, ఆక్యుపెన్సీ ధ్రువీకరణ పత్రం, నిర్మాణ అనుమతులు, భూమికి సంబంధించిన పత్రాలు, ప్రభుత్వ రికార్డులు తదితరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలి. బిల్డర్ చెప్పిన మాటలను మాత్రమే నమ్మకుండా, సంబంధిత ప్రభుత్వ శాఖల రికార్డులను పరిశీలించి, అవసరమైతే న్యాయ నిపుణుల సలహా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను నివారించవచ్చు.

**బిల్డర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి**


కూకట్‌పల్లి జోన్‌లో గుర్తించినట్లు చెబుతున్న 355 అక్రమ నిర్మాణాల వ్యవహారం కేవలం నిర్మాణాలపై చర్యలకే పరిమితం కాకుండా, అనుమతులు ఎలా జారీ అయ్యాయి? నిర్మాణ సమయంలో పర్యవేక్షణ ఎలా జరిగింది? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పుడు అధికారులు ఎందుకు అడ్డుకోలేదు? వంటి ప్రశ్నలకు కూడా సమాధానాలు లభించాల్సిన అవసరం ఉంది. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలి. నిబంధనలు ఉల్లంఘించిన బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో వారి తప్పులకు అమాయక ఫ్లాట్ కొనుగోలుదారులు బలికాకుండా ప్రభుత్వం న్యాయం చేయాలి.

## NH-44 వెంబడి సర్వీస్ రోడ్డు, ఫ్లైఓవర్ పనులు ప్రారంభించాలి

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతి.. మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**



**వనపర్తి ఆగస్టు 24 క్రైమ్ మిర్రర్రూ** జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 వెంబడి పెబ్బేరు పరిధిలో సర్వీస్ రోడ్డు నిర్మాణంతో పాటు కొత్తకోట బైపాస్ వద్ద మంజూరైన ఫ్లైఓవర్ పనులను ప్రారంభించాలని సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. పెబ్బేరు బైపాస్ నుంచి 2బీహెచ్‌కె ఇళ్లు, ఫిషరీస్ కళాశాల, మోడల్ స్కూల్, ప్రాంతీయ రవాణా కార్యాలయం ఘూ పాలిటెక్నిక్ కళాశాల వరకు ఎన్‌హెచ్-44 వెంబడి సర్వీస్ రోడ్డు లేకపోవడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు నిత్యం ప్రధాన జాతీయ రహదారిపై నుంచే వెళ్లాల్సి వస్తోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల తరచూ రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల భద్రతకు ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్థల పరిశీలన చేపట్టి, సాంకేతిక అంచనాలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కొత్తకోట బైపాస్ వద్ద ఇప్పటికే ఫ్లైఓవర్ నిర్మాణం మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల తీవ్రత పెరుగుతోందని తెలిపారు. ఈ పనులను ఆలస్యం చేయకుండా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కోరారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం

తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


## ప్రభుత్వం విద్యార్థుల భవిష్యతుతో చెలగాటమాడుతోంది : మాధవరం కాంతారావు



**కూకట్ పల్లి, ఆగస్టు 24 (క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ప్రభుత్వం సుమారు 40 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు భాజపా కార్యాలయంలో చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు కూకట్ పల్లి బిజెపి నాయకులు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. కూకట్ పల్లి నియోజకవర్గం బిజెపి అధ్యక్షులు మాధవరం కాంతారావు అధ్యర్యంలో నాయకులు కూకట్ పల్లి నుండిభాజపా కార్యాలయానికి తరలివెళ్లారు. రామచందర్ రావుతో కలిసి నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల తెలంగాణ రాష్ట్రంలో నాలుగు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు, ప్రస్తుతం పదివేల కోట్ల నుంచి 12 వేల కోట్ల వరకు రియంబర్స్మెంట్ పెండింగ్లో ఉందని,చదువులు పూర్తయిన సర్టిఫికెట్లు ఇంకా అందలేదని దుయ్యబట్టారు.ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాల్సిందేనని.. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల పట్ల అశ్రద్ధ వీడాలని లేదంటే అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్, జిల్లా అధికార ప్రతినిధి తోట రమేష్, కూకట్ పల్లి నియోజకవర్గం ఓబీసి కన్వీనర్ వినోద్ గౌడ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నూతన ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభం

**సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి**

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి**




**బాలానగర్, ఆగస్టు 24 (క్రైమ్ మిర్రర్) :** బాలానగర్లోని హిందూ ఇన్స్టిట్యూట్ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతన ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభమైంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్రెడ్డి కళాశాలను ప్రారంభించారు. కార్య క్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ హనుమంతరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పరి శ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించే దిశగా కళాశాల పనిచేయాలని ఆకాంక్షించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని దేశ అభివృద్ధిలో యువత భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను వినియోగించాలి

**మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్**



**కూకట్ పల్లి, ఆగస్టు 24 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని ప్రభుత్వ స్థలాల వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్థలాలను వేలం వేసే విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఎంపీ ఈటెల రాజేందర్ సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాలు ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు విక్రయించినా, లీజుకు ఇచ్చినా స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లో గృహాలను నిర్మించి అందించడం వంటి ప్రజా ప్రయోజన నిబంధనలను అమలు చేసేవని గుర్తు చేశారు. అలాంటి ప్రజా ప్రయోజన నిబంధనలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వ భూములను కేవలం ప్రస్తుత ఆర్థిక అవసరాల కోసం విక్రయించడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వ భూములు ప్రజలకు తరతరాలుగా ఉపయోగపడే విధంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కూకట్‌పల్లి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను పార్కులు, క్రీడా మైదానాలు, సీనియర్ సిటిజన్స్ క్లబ్‌హౌస్‌లు, ప్రజా అవసరాల కోసం కేటాయించాలని ఈటెల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్న విధంగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని ప్రభుత్వ స్థలాల వేలాన్ని ప్రభుత్వం తక్షణమే నిలిపివేసి, స్థానిక ప్రజల అవసరాలు, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తిగా భావించి, వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కూకట్‌పల్లి ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## పాలమాకుల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..ఒకరి మృతి



గండిపేట(క్రైమ్ మిర్రర్): పాలమాకుల సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటేష్ తన స్నేహితుడి యమహా బైక్ (టిఎస్07ఎం5472)పై కార్తీక్ రెడ్డితో కలిసి మామిడిపల్లి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్నారు. పాలమాకుల దాటిన 200 మీటర్ల వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ (ఎపి16టిజె1537) వెంకటేష్‌పై నుంచి వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌పై వెనుక కూర్చున్న కార్తీక్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ బ్రహ్మదేవ్ యాదవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# టీజీపీఏలో ఏపీ ఎక్సైజ్ ఎస్ఐలకు ఉన్నతాధికారుల మార్గదర్శనం

**148 మంది ట్రైనీలతో ముఖాముఖి**

**శిక్షణ, వసతులపై సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ**





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో శిక్షణ పొందుతున్న 148 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లతో ముఖాముఖి నిర్వహించేందుకు ఆ శాఖ కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ సోమవారం ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)ని సందర్శించారు. ఈ సందర్భంగా రాణి రుద్రమదేవి ఆడిటోరియంలో 148 మంది ఎక్సైజ్ ఎస్ఐలతో ఉన్నతాధికారులు ముఖాముఖి నిర్వహించారు. ట్రైనీలతో నేరుగా మాట్లాడి, శిక్షణా కార్యక్రమాలు, అకాడమీలో అందుతున్న వసతులు, భోజనం, వసతి, ఫిజికల్ ఫిట్‌నెస్, శిక్షణా విధానం తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ట్రైనీలు శిక్షణకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని తెలియజేయడంతో ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ట్రైనీల శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, శిక్షణ పట్ల ఉన్న ఆసక్తిని వారు అభినందించారు. అనంతరం కమిషనర్ శ్రీధర్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ట్రైనీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఎక్సైజ్ చట్టాల అమలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సవాళ్లు, వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. శిక్షణలో పొందిన జ్ఞానం, నైపుణ్యాలను ప్రజా సేవలో సమర్థవంతంగా వినియోగించాలి అని వారు ట్రైనీలకు సూచించారు. విధి నిర్వహణలో చట్టబద్ధత, నిష్పక్షపాత వైఖరి, క్రమశిక్షణ, ప్రజల పట్ల బాధ్యతాయుతమైన ప్రవర్తన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

**అర్ బి వి ఆర్ ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ లో శిక్షణ కు ప్రశంసలు...**

టీజీపీఏలో ఏపీ ఎక్సైజ్ ఎస్ఐలకు అత్యుత్తమ శిక్షణ అందించేందుకు అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్ట్ ఆధ్వర్యంలో అధికారులు, శిక్షణ సిబ్బంది చేస్తున్న కృషిని కమిషనర్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ట్రైనీలకు ఉత్తమ శిక్షణతో పాటు నాణ్యమైన మౌలిక వసతులు, వసతి, ఫిజికల్ ఫిట్‌నెస్ సౌకర్యాలు కల్పిస్తున్నందుకు టీజీపీఏ డైరెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. అకాడమీ అందిస్తున్న శిక్షణా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరహరి, టీజీపీఏ అధికారులు, శిక్షణ సిబ్బంది, ఏపీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు చెందిన 148 మంది ఎస్ఐ ట్రైనీలు పాల్గొన్నారు...



# పెబ్బేరు బస్టాండులో సీసీ బెడ్ పనులు ప్రారంభం

**ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలి**

**మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**

**వనపర్తి ఆగస్టు 24 క్రైమ్ మిర్రర్:** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో చేపడుతున్న సీసీ బెడ్ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండు ఆవరణలో గుంతల కారణంగా వర్షాకాలంలో నీరు నిలిచిపోయి ప్రయాణికులు, బస్సు డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్టణ ప్రజలు, ప్రయాణికుల కష్టాలను స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకుపోగా రూ, 39 లక్షల 67 వేలతో సీసీ బెడ్ నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ ?నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బి ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని, మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు పర్వీన్ షకీల్, జములమ్మ, శివసాయి, భాగ్యలక్ష్మి శివ, వనపర్తి డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, డిప్యూటీ ఇంజనీర్ జంగయ్య, ఏఈ సంపత్ కుమార్, కాంట్రాక్టర్ కృష్ణ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి, మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# చిన్నశంకర్‌పల్లి శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**శ్రావణమాసం రెండో సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు.. అన్నదానం**



**క్రైమ్ మిర్రర్, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు చిన్నశంకర్‌పల్లిలో గల శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం రెండో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదవ వార్డు కౌన్సిలర్ బనూరి కృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ఉషా విజయ్ కుమార్, ఆలయ నిర్వాహకులు కలిసి అన్నదాన దాత బనూరి కృష్ణను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా బనూరి కృష్ణ మాట్లాడుతూ, శ్రావణమాసంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్నదానం చేయడం ద్వారా ఆధ్యాత్మిక సంతృప్తి కలుగుతుందని, భవిష్యత్తులో కూడా ఆలయ కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు శ్రీకాంత్ గౌడ్, ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ సైట్‌లో ప్రమాదం.. యువకుడు మృతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ సైట్‌లో నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుంచి కిందపడిన 25 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జగ్గిశెట్టి సాయి తేజ (25), తండ్రి జగ్గిశెట్టి సత్యం, సోమవారం ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో ఆర్‌కే కన్‌స్ట్రక్షన్స్ సైట్‌లో ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనం మొదటి అంతస్తు నుంచి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాయి తేజను చికిత్స నిమిత్తం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి 'బ్రాట్ డెడ్'గా ప్రకటించారు. ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** లండన్ పర్యటన ముగించుకుని తెల్లవారుజామున శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సీఎం రాకను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంను కలిసిన పలువురు నాయకులు లండన్ పర్యటన విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు సంబంధించి లండన్‌లో నిర్వహించిన కార్యక్రమాలు, వివిధ సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశాల వివరాలపై ఆరా తీశారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై లండన్ పర్యటనలో చర్చలు జరిగిన నేపథ్యంలో సీఎం పర్యటనపై పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. పర్యటన విజయవంతంగా ముగించుకుని ముఖ్యమంత్రి తిరిగి హైదరాబాద్ చేరుకోవడంతో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో సందడి నెలకొంది. నాయకులు, కార్యకర్తల రాకతో కొద్దిసేపు అక్కడ రాజకీయ వాతావరణం కనిపించింది.

# అర్హుల జాబితా ఆధారంగా డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు:తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ




**మందమర్రి టౌన్ ఆగస్టు 24 క్రైమ్ మిర్రర్:** మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మందమర్రి మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు సోమవారం తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రకటించిన అర్హుల జాబితా ఆధారంగా మంగళవారం ఉదయం 10 గంటలకు సండ్రోన్‌పల్లి గ్రామ పరిధిలోని కెఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నామని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను లక్కీ డ్రా పద్ధతిలో ఎంపిక చేసి, వారికి డబుల్ బెడ్రూం ఇళ్లలోని బ్లాక్, ఫ్లోర్ కేటాయించనున్నట్లు వారు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని అన్నారు. లబ్ధిదారులకు మాత్రమే హాల్ లోకి అనుమతి ఉంటుందని, ఇతరులకు అనుమతి లేదని స్పష్టం తెలిపారు. లబ్ధిదారులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని అన్నారు. కేటాయింపు అనంతరం లబ్ధిదారుల్లో ఎవరైనా అనర్హులు ఉన్నట్లు వ్రాతపూర్వకంగా ఫిర్యాదులు అందితే సమగ్ర విచారణ చేపట్టి, అనర్హులకు కేటాయించిన ఇళ్లను రద్దు చేయడంతో పాటు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రజలు అధికారులకు సహకరించి, నిజమైన అర్హులకు ఇళ్లు దక్కేలా చూడాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే నేరుగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఆగస్టు 24:** మిర్యాలగూడ మండలం ఆలగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గూడూరు సబ్‌సెంటర్ ఎస్సీ కాలనీలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందించారు. వర్షాకాలంలో వాతావరణ మార్పుల కారణంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు. జ్వర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రఫీ, హెచ్‌ఈఓ ప్రభాకర్, పీహెచ్‌ఎన్ రాములమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గం లో మ్యాపింగ్ చేసుకోని, పేర్లు తప్పులున్న ఓటర్లకు నోటీసులు అందచేస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్ లు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం లో మ్యాపింగ్ చేసుకోని వారు, పేర్లు తప్పులున్న వారిని కలుపుకుని 6,364 మంది ఓటర్ల కు సోమవారం నోటీసులు అందచేయడం జరిగిందని నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నోటీసు లందుకున్నావారు ఈ నెల 27 నుంచి హియరింగ్ కు వచ్చి తమ వద్ద ఉన్న ధ్రువ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని, అందుకు సంబంధించిన నోటీసులు అందచేయడం జరిగిందని తెలిపారు. మ్యాపింగ్ చేసుకోని వారు, పేర్లు తప్పులున్న వారు నోటీసులు అందిన వెంటనే వారికిచ్చిన తేదీలలో బీ ఎల్ ఓ లను, వారి ద్వార అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ లను సంప్రదించి తమ ఓటు ను పదిలం చేసుకోవాలన్నారు.

# నేలకొండపల్లి, కొత్త కొత్తూరు గ్రామాలలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. పది సంవత్సరాలు బి ఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు అని అన్నారు. పేదవారిని పట్టించుకోలేని పార్టీ మీ బి ఆర్ ఎస్ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి అని అన్నారు. పేద ప్రజల సంక్షేమూ కోసం ఎన్నో పథకాలు సన్న బియ్యం, ఉచిత విద్యుత్, మహిళాలకు ఫ్రీ బస్, రైతులకు రుణ మాఫీ, బోనస్, రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం అందించినది అని అన్నారు. పేదల ప్రజల సంక్షేమశీ కోరే కాంగ్రెస్ ప్రభుత్వంను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని, మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని ప్రజలు ఆశీర్వాదించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్, సర్పంచ్లు మాలోత్ కళావతి, శీలం వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ లు వల్లాల రాధాకృష్ణ, మద్దినేని మహేష్, వార్డ్ మెంబెర్స్, పంచాయతీ కార్యదర్శిలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్య వ్యవస్థలో చిక్కుముడులు వేస్తూ, ఫారంలు అందజేయకుండా ఓటు హక్కుకు భంగం కలిగిస్తారా

## భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్ రావు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సమయంలో తల్లిదండ్రుల వివరాలు పొందుపరిచి మ్యాపింగ్ చేసిన వారికి కూడా కొంత మందికి నోటీసులు జారీ చేసి అందులో తాతల వివరాలు అడగడం వింతగా గోచరిస్తుంది, అంతే కాకుండా పాస్పోర్టు, 10వ తరగతి చదువుకున్న సర్టిఫికేట్ జత పరచమని కోరుతూ కేవలం 5 రోజులలో జవాబు ఇవ్వాలని కోరుతున్నారు. భారత దేశంలో పుట్టి పెరిగిన మధ్య తరగతి ప్రజలు చదువుకోకుండా, పాస్పోర్టు లేకుండా, సగటు జీవితం గడుపుతున్న వారు ఇచ్చిన కొద్ది రోజుల సమయంలోనే సమాచారం ఇవ్వని యెడల ఓటు హక్కును కోల్పోవలసి ఉంటుందా ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇట్టి నిబంధనలను సడలించి ప్రజా సౌకర్యార్థం సరళీకరణ చేయాలని భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్ రావు డిమాండ్ చేస్తున్నారు. ఓటు నమోదు కార్యక్రమంలో ఆక్షేపణలు, అభ్యంతరాలు, దిద్దుబాటులు ఆగష్టు 17 మొదలు సెప్టెంబర్ 16 వరకూ ఉండగా వారం రోజుల గడువు గడిచినను అధికారుల పాత్ర, నిర్లక్ష్య ధోరణి వలన ఫారం 6 భౌతికముగా అందుబాటులో లేకపోవడంతో 18 సంవత్సరంలు నిండిన యువత భౌతికంగా ఫారం 6 పూరించి తమ ఓటు హక్కును పొందలేక పోతోన్నారని, అట్లాగే అనివార్య కారణాల వలన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో అందుబాటులో లేని ప్రజలు ఫారం 6 చిక్కక ఓటు హక్కును పొందలేక పోతున్నారని అందుకు అధికారుల నిర్లక్ష్య ధోరణియే కారణమనీ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అదేవిధంగా ఓటర్ లిస్టో ఉన్న లోటు పాట్లను సరి చేసుకోవడానికి, ఎక్కడో ఉన్న ఓటు హక్కును ఇక్కడకి మార్చుకోవడానికి ఫారం 8 అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, నిరాశ నిస్పృహలకు గురౌతున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిపిన అనంతరం కూడా కొంత మంది పేర్లు రెండు నియోజక వర్గాల్లో ఉన్నవని పసిగట్టడం జరిగిన దరిమిలా ఇట్టి ద్వంద పేర్ల నమోదును తొలగించడానికి ఫారం 7 భౌతికంగా అందుబాటులో లేకపోవడంతో సవరణ చేయలేక పోతున్నామని అందుకు సంబంధిత అధికారులు స్పందించి ప్రజా సౌకర్యార్థం వెంటనే ఫారం 6, 7, 8 భౌతికంగా అందుబాటులోకి తేవాలని ప్రజాసంక్షేమం, హక్కుల సాధన కొరకు భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్ రావు డిమాండ్ చేస్తున్నారు.

# సన్‌సిటీ నర్సింగ్‌హోమ్ ఎదుట అధ్వానంగా రోడ్లు..

### పట్టించుకోని అధికార యంత్రాంగం





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సన్‌సిటీ నర్సింగ్‌హోమ్ ఎదుట రహదారి పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి, రోడ్డు మొత్తం అసమతలంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో రహదారి సమస్య ఒక్కటే కాకుండా పలు మౌలిక వసతుల సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా సరైన నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు డ్రైనేజీ లైన్ కూడా సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు సరిగా వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు తెలిపారు. గుంతలు నీటితో నిండిపోవడంతో వాటి లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సింగ్‌హోమ్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులు కూడా రహదారి పరిస్థితితో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**ఏళ్లుగా సమస్యలతో సతమతం...**

సంబంధిత అధికారులకు సమస్యలను పలుమార్లు తెలియజేసినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డు మరమ్మతులతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో పరిశీలించి అవసరమైన పనులు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే తాగునీటి సమస్యను కూడా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్...**

సన్‌సిటీ నర్సింగ్‌హోమ్ ఎదుట రహదారిని అధికారులు వెంటనే పరిశీలించి గుంతలను పూడ్చి, రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. డ్రైనేజీ లైన్‌ను సరిచేసి మురుగు నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన రోడ్డు, నీరు, డ్రైనేజీ సమస్యలను ఇకనైనా అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గంజాయి నియంత్రణ కు యాక్షన్ ప్లాన్ ఇతర రాష్ట్రాల మద్యం సరఫరా ఎట్టి పరిస్థితిలో క్షమించం.

### ఎమ్మార్పీ కి మించి మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం

### ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ఆర్. కిషన్.



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** గంజాయి నియంత్రణ కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ను ఏర్పాటు . చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ఆర్. కిషన్ పేర్కోన్నారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోకి గంజాయి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భద్రాచలం లో ప్రత్యేకంగా ఎన్ఫోర్స్మెంట్ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరం ప్రత్యేక నిఘా ద్వారా గంజాయి ని కట్టడి చేస్తున్నట్లు తెలిపారు. 'ఉమ్మడి జిల్లా ను సారా రహిత డివిజన్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం సరఫరా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంతర్ రాష్ట్ర చెకోపోస్టుల ద్వారా ఎన్డీపీ మద్యం ను అరికడుతున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల మద్యం ను ఎట్టి పరిస్థితులలో క్షమించేది లేదన్నారు. అక్రమ వ్యాపారం పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. మద్యం దుకాణాలలో ఎమ్మార్పీ కి మించి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.మద్యం వ్యాపారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బెల్టాపు లు నిర్వహాణ పై కేసులు నమోదు చేస్తామన్నారు. నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ భవనం పనుల కోసం మంత్రి శ్రీనివాసరెడ్డి రూ.10 లక్షలు మంజూరు ప్రతిపాధనలు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి స్టేషన్ ఇంచార్జ్ సీఐ టి.లత ఉన్నారు.




# సమయపాలన పాటించని, మెనూ అమలు చేయని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్ జనార్ధన్ పై చర్యలు తీసుకోవాలి

### హాస్టల్స్ పై జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, ప్రవీణ్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, ప్రవీణ్ మాట్లాడుతూ ఖమ్మం నగర కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్మెట్రిక్ హాస్టల్ లో విధులు నిర్వహిస్తున్న వార్డెన్ జనార్ధన్ సమయపాలన పాటించకుండా తనకు ఇష్టం వచ్చినప్పుడు హాస్టల్ కు వచ్చి వెళ్తా ఉన్నాడని. కనీసం విద్యార్థులు ఎంతమంది హాస్టల్లో ఉన్నారు. వారికి భోజనం వండేదానికోసం గాని టిఫిన్ పెట్టేదాని కోసం గానీ ఏం సరుకులు ఇవ్వాలి ఏం కూరగాయలు ఇవ్వాలి అనేటువంటిది పట్టించుకునే దుస్థితి కూడా లేదని అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఇచ్చినటువంటి మెనూ కూడా పాటించకుండా తనకు ఇష్టం వచ్చిన పద్ధతిలో విద్యార్థులకు వండి పెడుతూ ఉన్నటువంటి పరిస్థితి హాస్టల్ లో ఉందని ఖమ్మం డివిజన్ కు సంబంధించిన ఏటీడీవో అదేవిధంగా జిల్లా డిడి పర్యవేక్షణ లోపం వల్లనే ఇలా వార్డెన్స్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని తరచుగా హాస్టల్స్ పై అధికారుల పర్యవేక్షణ ఉంటే వార్డెన్లు సరైన పద్ధతిలో పనిచేస్తారని మెనూ అమలు పరుస్తారని అధికారులు తక్షణమే నిర్లక్ష్యం వీడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ అధ్యక్షులు త్రినాథ్ డివిజన్ నాయకులు శ్యామ్ లోహిత్ కుమార్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ డిఎస్పీగా ప్రజలకు టోపీ

### రూ.1.20 కోట్లు వసూళ్లు.. వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్: నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడి పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ హోదాలు, అధికారుల పేర్లు ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



# మణికొండలో మంచినీటి సరఫరా సమయం పెంచాలని అధికారులకు వినతి.

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు మంచినీటి సరఫరా సమయాన్ని పెంచాలని కోరుతూ డివిజన్ పరిధి నాయకులు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ డీజీఎం వెంకటేశ్వర్లు గారిని కలిసి కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మణికొండ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు ప్రస్తుతం అందుతున్న మంచినీటి సరఫరా సమయం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంచినీటి సరఫరా సమయాన్ని పెంచి, అన్ని కాలనీలకు తగిన సమయంలో సరిపడా నీరు అందేలా చూడాలి అని డీజీఎం వెంకటేశ్వర్లు ని కోరారు. నాయకుల విజ్ఞప్తిపై స్పందించిన డీజీఎం వెంకటేశ్వర్లు .. మణికొండ డివిజన్ పరిధిలో మంచినీటి సరఫరా సమయాన్ని అత్యవసరంగా పెంచి, ప్రజలకు తగిన సమయంలో మంచినీరు అందేలా చూస్తాము అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మణికొండ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ మేనేజర్ మాజిద్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి , మాజీ సర్పంచ్ యానాల నరేశ్, నవజ్యోతి యువజన సంఘం అధ్యక్షులు రవికాంత్ రెడ్డి , నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్ , నాయకులు మధుసూదన్ రెడ్డి , సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అనధికార నిర్మాణాలు, ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ అధికారుల కొరడా






**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అనధికార నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని నార్సింగి సర్కిల్--45 డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టే వారిపై చట్ట ప్రకారం చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. నార్సింగి సర్కిల్--45 పరిధిలో అనధికార నిర్మాణాలు, ప్రభుత్వ, పార్కు స్థలాల ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. సోమవారం నెక్నాంపూర్, నార్సింగి ప్రాంతాల్లో పలు అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగింపు, సీజ్ చర్యలు చేపట్టారు. నెక్నాంపూర్‌లోని కృష్ణారెడ్డి ఎన్‌క్లేవ్‌లో అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తుల నిర్మాణం చేపడుతున్న భవనంపై అధికారులు చర్యలు తీసుకున్నారు. భవనం 5వ అంతస్తుకు ఏర్పాటు చేసిన సెంటరింగ్‌ను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. అనంతరం నిబంధనల ప్రకారం భవనాన్ని సీజ్ చేశారు. నెక్నాంపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 31, సెక్రటేరియట్ వైఎస్సార్ కాలనీలో పార్కు స్థలంలో జరిగిన అనధికార ఆక్రమణలపై కూడా అధికారులు చర్యలు చేపట్టారు. పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన అనధికార నిర్మాణాలను తొలగించి స్థలాన్ని ఆక్రమణల నుంచి విముక్తి చేశారు. నార్సింగి 60 యార్డ్స్ కాలనీ, గిరిగిరిగడ్డ ప్రాంతంలో అనుమతులు లేకుండా నిర్మించిన గ్రౌండ్ ప్లస్ వన్ అప్పర్ ఫ్లోర్ భవనాన్ని కూడా టౌన్ ప్లానింగ్ ఏ సి పి ప్రసిద్ధ, టిపిఓ రమేష్, అధికారులు నిబంధనల ప్రకారం సీజ్ చేశారు. ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను పరిరక్షించేందుకు అధికారులు మరింత కఠినంగా వ్యవహరించనున్నట్లు వెల్లడించారు.

# సుబ్లేడు ఆసుపత్రిలో వెంటనే వైద్యులను నియమించాలి

### సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

### తిరుమలాయపాలెం మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వైద్యులు, సిబ్బందిని నియమించాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డి ఎమ్ ఒ హెచ్ ఓ వెంటనే చర్యలు చేపట్టి బాధ్యత వహించాలని కోరారు. ప్రజలకు ఏదైనా హాని జరిగితే అందుకు వైద్య, ఆరోగ్య అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విషజ్వరాల నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

తెలంగాణ జిల్లాలు





## గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలి

### బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** చెరువుమాదారం గ్రామంలోని కొండా హర్ష వర్ధన్ నివాసం వద్ద భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గ్రామ శాఖ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనీ కిముఖ్య అతిథులు గా బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్, మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, మరియు మండల అధికార ప్రతినిధి సూరేపల్లి జ్ఞానరత్నం మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రజల సమస్యలపై నిరంతరం అందుబాటులో ఉండడం మరియు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు పిలునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గెల్లా చక్రపాణి, ఏపూరి సత్యనారాయణ, జెల్లా సురేష్తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ ఆవిష్కరణ

### ఆర్థిక అక్షరాస్యత కీలకం.. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**క్రైమ్ మిర్రర్, సూర్యాపేట :**ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన ఆర్థిక అవగాహన పోస్టర్లను సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ , జాయింట్ కలెక్టర్ హరిసింగ్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకట నాగ ప్రసాద్, లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు. బ్యాంకింగ్ సేవలు, పొదుపు, రుణాలు, బీమా, పింఛన్, డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల పాత్ర కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డిఏ పీడీ , డిఆర్ఓ, ప్రేమ్ రాజు, డిపివో యాదగిరి,సీసీ నాగరాజు ,సూర్యాపేట జిల్లా కౌన్సిలర్స్ శ్రవణ్ కుమార్, రాంబాబు,అశోక్,రామకృష్ణ, నరేష్,లక్ష్మణ్, వెంకటేష్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎండిఎ కమిషనర్తో రఘునందన్ రావు భేటీ

### పెండింగ్ రోడ్లు, రైల్వే పనుల పూర్తికి అభ్యర్థన

హైదరాబాద్: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలపై హెచ్ఎండీఏ కమిషనర్, మెట్రో రైల్వే మేనేజంగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ను కలిసి చర్చించినట్లు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలిపారు. పటాన్చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు పొడిగింపు అంశంపై చర్చించడం జరిగింది. పటాన్చెరు ఎగ్జిట్–3 నుంచి ఎగ్జిట్–4, సుల్తాన్పూర్ మధ్య పెండింగ్లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరడం జరిగింది. కొల్లూరు ఎగ్జిట్–2 వద్ద పెండింగ్లో ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరడం జరిగిందని అన్నారు.

## కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

### దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# కోదాడ మీదుగానే హైస్పీడ్ బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ కొనసాగించాలి






### భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం పాత ప్రతిపాదిత మార్గాన్నే కొనసాగించాలి

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**కోదాడ: ఆగస్టు 24 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ:హైదరాబాద్––అమరావతి––చెన్నై నగరాలను అనుసంధానించే ప్రతిపాదిత హైస్పీడ్ బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌ను మార్చకుండా, గతంలో ప్రతిపాదించిన విధంగానే సూర్యాపేట––కోదాడ మీదుగా రైలుమార్గాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కోదాడ పట్టణం, నియోజకవర్గ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పబ్లిక్ క్లబ్‌లో ఆయన అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. కోదాడ మీదుగా బుల్లెట్ రైలు వెళ్లాలనే డిమాండ్ తన వ్యక్తిగత అభిప్రాయం కాదని, ఇది కోదాడ నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష, భవిష్యత్ తరాల అవసరం అని అన్నారు. అలైన్‌మెంట్ నిర్ణయంలో ప్రస్తుత పరిస్థితులతో పాటు రాబోయే తరాల అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని, రైల్వే శాఖను కోరారు. గతంలో హైదరాబాద్––కోదాడ ప్రయాణం కోసం ఎదురైన ఇబ్బందులను గుర్తుచేస్తూ.. ఒకప్పుడు సింగిల్ రోడ్డే ప్రధాన రవాణా మార్గంగా ఉండేదని, తరచూ ప్రమాదాలు జరిగేవని, హైదరాబాద్ ప్రయాణానికి గంటల సమయం పట్టేదని తెలిపారు. ప్రజా ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా మెరుగైన రహదారి సౌకర్యం సాధించుకున్నామని, అదే స్ఫూర్తితో భవిష్యత్ తరాల కోసం మెరుగైన రైలు రవాణా సౌకర్యాన్ని కూడా సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కోదాడ ప్రాంతంలో జనాభాతో పాటు విద్య, పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు అభివృద్ధి చెందుతున్నాయని, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన రవాణా సౌకర్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. హైస్పీడ్ రైలు కోదాడ మీదుగా వెళ్లేలా సాధించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, వ్యాపార సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, యువత, ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# సారంపల్లి మల్లారెడ్డి రైతులకు చేసిన సేవలు చిరస్మరణీయం

### తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ రైతు సంఘం, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి రైతులకు చేసిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు కొనియాడారు. గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఆయన మరణించారు. విషయం తెలుసుకున్న నాయకులు తెలంగాణ రైతు సంఘం, సిపిఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ సారంపల్లి మల్లారెడ్డి రైతుల పట్ల ఎర్ర జెండా పట్ల అచంచలమైన విశ్వాసంతో అంకితభావంతో నిబద్ధతతో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. తన తుది శ్వాస వరకు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమిస్తూ అహర్నిశలు కృషి చేశారని అన్నారు. నిత్యం రైతుల వెన్నంటే ఉంటూ వారి సాధక బాధలు వింటూ వారిని చైతన్యవంతం చేశారన్నారు. వ్యవసాయ సాగులో రైతుల కష్ట నష్టాలు, పెట్టుబడులు, ఆదాయ వ్యయాలపై అధ్యయనం చేస్తూ వారు పండించిన పంటలకు ప్రభుత్వం చెల్లించాల్సిన మద్దతు, గిట్టుబాటు ధరలపై ఉద్యమించారన్నారు. రైతాంగ సమస్యలుబి పరిష్కార మార్గాలపై ఆయన చేసిన సమగ్ర అధ్యయనం, నివేదికలను ప్రభుత్వం, సంబంధిత అధికారులే అనుసరించేలా ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా ఉండేవారన్నారు. తెలంగాణ రైతు సంఘం కార్యదర్శిగా గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచారన్నారు. నేడు ఆయన ఆకస్మిక మరణం తెలంగాణ రైతాంగానికి సిపిఐ(ఎం) అభివృద్ధికి తీరని లోటన్నారు. ఆయన స్ఫూర్తితో రానున్న కాలంలో ప్రతి ఒక్కరూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కొత్తూరు వెంకటాచారి, రావెళ్ల అజయ్ కుమార్, తెల్లమేకల శేషబాబు, షేక్ అబ్దుల్, నబీ సామల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియాన్ని బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిపై పీడీ యాక్ట్ : పోలీస్ కమిషనర్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి అంతర్రాష్ట్రాలకు తరలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ ఆర్థిక లాభాలు ఆర్జిస్తున్న మీర్జా జిలానీ బేగ్ (48) సం,, పై పీడీ యాక్ట్‌ను అమలు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన మీర్జా జిలానీ బేగ్ (48) సం,, రేషన్ డీలర్లు, వారి ఏజెంట్ల ద్వారా కార్డుదారులకు అందాల్సిన సబ్సిడీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడిపై తల్లాడ పోలీస్ స్టేషన్లలో పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోలుసంబంధించి మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ (ఈసీయాక్ట్), తెలంగాణ పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్స్‌కు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి కార్యకలాపాల ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉద్దేశించిన ఆహార భద్రత వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతోందని, సమాజానికి అవసరమైన నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై గతంలో పలుమార్లు కేసులు నమోదు కావడంతో పాటు, బీఎన్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినప్పటికీ తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్ అమలు చేసి వైరా సిఐ వెంకట ప్రసాద్, తల్లాడ ఎస్సై వెంకట కృష్ణ నిందితుడిని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

### కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం

### సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్

### మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్

మెదక్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఎఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.